బ్రిడ్జీలు నిర్మించారు- తారు మరిచారు

- బ్రాహ్మణపల్లి, కాళోజీవాడి గ్రామాల్లో కొత్తగా రెండు బ్రిడ్జీల నిర్మాణం
- బ్రిడ్జిలకు అనుసంధానంగా తారు రోడ్డు వేయకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు
- కొద్దిపాటి వర్షానికే జారిపడుతున్న ద్విచక్ర వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


బ్రాహ్మణపల్లిలో కొత్తగా నిర్మించిన బ్రిడ్జి వద్ద అధ్వానంగా తయారైన రోడ్డు


కాళోజీవాడి శివారులోని బ్రిడ్జి వద్ద ..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రాహ్మణపల్లి, కాళోజీవాడి గ్రామ శివార్లలోని రహదారుల మధ్యలో రెండు బ్రిడ్జీలను నిర్మించారు. కాని బ్రిడ్జిలకు ఇరువైపులా తారు రోడ్డు వేయడం మరిచారు. దీంతో ప్రతిరోజు ఈరోడ్డుపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తారు బదులు నాసిరకం మొరం వేయడంతో కొద్దిపాటి వర్షానికే తొలిగిపోయి గుంతలయంగా మారింది. దీంతో ఎప్పుడైనా వర్షం పడితే వాహనాలు జారుతున్నాయి. గతంలో వర్షాకాలం వచ్చిందంటే చాలు కాలోజీవాడి, బ్రాహ్మణపల్లి శివారులలో ఉన్న వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండేవి. దీంతో ఈ ప్రాంతంలో ఉన్న ఐదు గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రం, మండల కేంద్రానికి వెళ్లాలంటే భయంతో ప్రాణాన్ని గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణించేవారు. ఈ విషయాన్ని ఆయాగ్రామాల ప్రజలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అప్పటి ప్రభుత్వం 2023లో బ్రాహ్మణపల్లి బ్రిడ్జికి రూ.2.50కోట్లు, కాళోజీవాడి బ్రిడ్జికి రూ.2.10 కోట్ల నిధులను మంజూరు చేసింది. నిధులు మంజూరు కావడంతో ఐదు గ్రామాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. వెంటనే పనులను ప్రారంభించారు. అన్ని అవాంతరాలను దాటుకొని రెండు బ్రిడ్జిలను పూర్తిచేశారు. కాని ఆ కాంట్రాక్టర్ బ్రిడ్జీలపై బీటీ రోడ్డు వేయడం మరిచారు. బీటీ బదులు మొరం పోశారు. దానికి తోడు బ్రిడ్జిలు రోడ్డు కంటే బాగా ఎత్తుగా ఉండడం ..మొరం రోడ్డు కావడంతో వాహనాలు ఎక్కే సమయంలో జారి మధ్యలోనే ఆగిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి



అధికారులు పట్టించుకోవాలి. రెండు బ్రిడ్జిల వద్ద తారు రోడ్డును వేయించాలి. లేకుంటే వాహనాలు జారిపోతున్నాయి. ఈ రోడ్డుపై ఆటోలు కూడా రావాలంటే భయపడుతున్నారు. ఇతర గ్రామాలకు వెళ్లాలంటే కిలో మీటరు వరకు కాలినడకన వెళ్లి అటోలలో ఎక్కి వెల్లవలసి వస్తుంది.

– బత్తుల స్వామి, బ్రాహ్మణపల్లి

కామారెడ్డికి తరచూ వెళ్తుంటా..



వివిధ పనుల నిమిత్తం కామారెడ్డి, తాడ్వాయికి తరచుగా వెళ్తుంటాను. కొత్తగా వేసిన బ్రిడ్జల వద్ద తారు బదులు నాసిరకం మొరం వేయడంతో వర్షాకాలంలో మొరం కొట్టుకుపోయింది. ఈ రోడ్డుపై ఐదు గ్రామాల ప్రజలు ప్రతిరోజు వెళ్తుంటారు. కొద్దిపాటి వర్షం పడిందంటే ప్రయాణం వాయిదా వేసుకోవాల్సిందే.

– పర్స నర్సింలు, కాళోజీవాడి

'రోడ్లు ఊడ్చే స్థితికి ప్రభుత్వం తీసుకొచ్చింది'


జిల్లా కేంద్రంలో రోడ్డు ఊడుస్తూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: బడిలో చాక్‌పీస్ పట్టాల్సిన ఉపాధ్యాయుల చేతులు చీపురు పట్టి రోడ్లు ఊడ్చి నిరసన తెలిపే స్థితికి ప్రభుత్వం తీసుకొచ్చిందని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. తమ డిమాండ్‌లను పరిష్కరించాలని చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె గురువారంతో 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై రోడ్డు ఊడ్చుతూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యా బోధనకు దూరమై విద్యా వ్యవస్థ ఆగమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసి పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షులు వాసంతి, నాయకులు రాములు, సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి గ్రంథాలయానికి పెండింగ్ బిల్లులు చెల్లించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి గ్రామ పంచాయతీ కార్యాలయాల నుంచి రావాల్సిన బకాయిలను చెల్లించాలని గ్రంథపాలకుడు రాజలింగం కోరారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు ప్రజల నుంచి వసూలు చేసిన బిల్లుల నుంచి 8 శాతం గ్రాంటును గ్రంథాలయానికి చెలించాల్సి ఉంటుందన్నారు.18 గ్రామ పంచాయతీలకు గాను గ్రంథాలయానికి రూ.12 లక్షలకుపైగా బకాయిలు రావాల్సి ఉందన్నారు. అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు చొరువ తీసుకొని పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించేలా కృషి చేయాలని కోరారు. గతంలో కూడా ఎన్నో సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ విషయం గురించి తెలియజేసినప్పటికీ వారు సరిగ్గా స్పందించడం లేదన్నారు.

సీసీ పనుల పరిశీలన



బాన్సువాడ రూరల్: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని తాడ్కోల్ శివారు బీడీ వర్కర్స్ కాలనీలో సీసీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనులను గురువారం బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ పరిశీలించారు. పనులు నాలుగు కాలాలపాటు నిలిచి పోయేలా నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట భగవాన్ రెడ్డి, నార్ల ఉదయ్ ఉన్నారు.

కదిలిన అధికార యంత్రాంగం

- అక్రమంగా మొరం రవాణా చేస్తూ అధికారుల కంటపడ్డ మొరం మాఫియా
- పొక్లెయిన్, టిప్పర్ సీజ్
- పోలీస్‌స్టేషన్‌కు టిప్పర్‌ను తరలిస్తుండగా .. వాహనంతో పరారైన డ్రైవర్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన గిర్దావర్


దుర్కి శివారులో పొక్లెయిన్, టిప్పర్ వివరాలు రాసుకుంటున్న గిర్దావర్ సాయిలు

సాక్షి ఎఫెక్ట్..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని పలు గ్రామాల్లో మొరం దందా జరుగుతోందని గురువారం 'మొరం అక్రమ రవాణా' శీర్షికన ప్రచురితమైన సాక్షి కథనానికి రెవెన్యూ అధికారులు కదిలారు. దీనితో మండలంలోని పలు గ్రామాల్లో నిఘా పెట్టగా.. దుర్కి గ్రామ శివారులో మొరం తవ్వుతున్న జేసీబీ, టిప్పర్‌లను అదుపులోకి తీసుకున్నట్లు గిర్దావర్ సాయిలు తెలిపారు. అయితే టిప్పర్‌ను బీర్కూర్ పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో రెవెన్యూ అధికారుల కన్నుగప్పి డ్రైవర్ వాహనాన్ని అటవిలో తీసుకెళ్లి కనపడకుండా పోయాడు. రెవెన్యూ సిబ్బంది కొరత వల్ల టిప్పర్ వాహనంతో డ్రైవర్ పారిపోయాడని, టిప్పర్ నెంబర్‌పై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి టిప్పర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేయాలని కోరినట్లు గిర్దావర్ సాయిలు తెలిపారు. పొక్లెయిన్ వాహనంతో పాటు డ్రైవర్ కూడా అటవి ప్రాంతంలో తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. వీలుకాకపోవడంతో పొక్లెయిన్‌ను వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయాలని ఎస్సై లావణ్యకు ఫిర్యాదు చేసినట్లు గిర్దావర్ తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు



బాన్సువాడ రూరల్: 'నిధులు లేక నిస్తేజం, పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం' అనే శీర్షికతో ఈ నెల 24న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి బాన్సువాడ ఎంపీవో సత్యనారాయణ స్పందించి బుడిమి, దేశాయిపేట్, సోమేశ్వర్ గ్రామాల్లో పర్యటించారు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీలు, వీధులను పరిశీలించి పంచాయతీ కార్మికులతో ప్రత్యేక పారిశుధ్య పనులు చేయించారు. గ్రామాల్లో ప్రజలు ఇంటి నల్లా ట్యాక్సులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

శరవేగంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ శరవేగంగా కొనసాగుతుంది. బుధవారం నాటికి లక్షా 47 వేల 206 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు



రామారెడ్డి: రామారెడ్డి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రంగు రవీందర్ గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు ఎమ్మెల్యే సూచించినట్లుగా రవీందర్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శిలాసాగర్, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవుఫ్, ఉప్పల్‌వాయి మాజీ సర్పంచ్ అరవింద్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తూర్పు రాజు, నామాల రవి, అంబాని ప్రసాద్, గోవింద నాయక్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ మహోత్సవం


బాన్సువాడలో అయ్యప్ప పడి పూజ మహోత్సవం

బాన్సువాడ : అయ్యప్ప పడి పూజ మహోత్సవం గురువారం బాన్సువాడలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అయ్యప్ప స్వామి 38వ సామూహిక పడి పూజ మహోత్సవం చేపట్టారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజతో ప్రారంభమైన పడి పూజ అర్ధరాత్రి వరకు కొనసాగింది. అయ్యప్ప ఆలయంలో ఉదయం స్వాములు హోమం నిర్వహించారు. కన్య స్వాములు స్వామి వారికి అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పెద్ద హనుమాన్ ఆలయం నుంచి స్వామి వారి అభరణాలతో భారీ శోభాయాత్ర నిర్వహించారు. వేద పండితులు చంద్రశేఖర్‌శర్మ, పురుషోత్తం శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. నిజామాబాద్ నుంచి వచ్చిన భజన కళాకారులు ప్రత్యేక గేయాలను ఆలపించారు. శ్రీశ్రీశ్రీ బాలయోగి పిట్ల కృష్ణ మహారాజ్, వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ తదితరులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అయ్యప్ప గురుస్వాములు శంకర్, గురువినయ్, మామిళ్లరాజు, మల్లికార్జున్, విఠల్ రెడ్డి, ముదిరెడ్డి విఠల్‌రెడ్డి, ధనగారి కృష్ణారెడ్డి, కోనాల గంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, నాగరాజు తదితరులున్నారు.

గ్రామస్థాయిలో బలోపేతానికే బూత్ కమిటీలు



రాజంపేట: గ్రామ స్థాయిలో బీజేపీ బలోపేతానికే బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు రాజంపేట మండల కేంద్రంలో గ్రామ బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించి 157వ బూత్ అధ్యక్షుడిగా సాదుల ప్రవీణ్, 158వ బూత్ అధ్యక్షుడిగా కె.వంశీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు. అనంతరం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బూత్ అధ్యక్షులను సన్మానించారు.

108 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): 108 అంబులెన్స్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రొగ్రాం మేనేజర్ మధుకుమార్, కామారెడ్డి జిల్లా మేనేజర్ తిరుపతి సూచించారు. తాడ్వాయి మండలానికి ప్రత్యేకంగా 108 అంబులెన్స్ వాహనాన్ని ప్రభుత్వం కేటాయించిందని వారు తెలిపారు. ప్రస్తుతం తాడ్వాయి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వాహనంతోపాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని, అత్యవసర సేవలకు ప్రజలు ఉయోగించుకోవాలని సూచించారు. వాహనాన్ని కేటాయించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరా..?



దోమకొండ: సంఘమేశ్వర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎలాంటి కంచె లేకుండా ప్రమాదకరంగా ఉంది. ఇళ్ల మధ్య ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా, దానికి ఎదురుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సైతం ఉంది. అతి తక్కువ ఎత్తులో ఎలాంటి కంచె లేకుండా ఇది ప్రమాదకరంగా ఉంది. దీనికి కంచెను ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంలో విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సమాచారం..

నేడు దోమకొండకు షబ్బీర్‌అలీ రాక

దోమకొండ: మండల కేంద్రంలో శుక్రవారం జరిగే కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి గురువారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు లక్ష్మీనారాయస్వామి ఆలయం, అనంతరం శివరాంమందిర్‌లో జరిగే ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

ఓబీసీ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శిగా గోవర్ధన్



కామారెడ్డి టౌన్: బీజేపీ ఓబీసీ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శిగా కానకుంట గోవర్ధన్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం నియామకపత్రాన్ని మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెర్క వెంకటేష్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తోట బాలరాజ్, పట్టణ అధ్యక్షుడు ఉప్పు లక్ష్మీపతి, నాయకులు బస్వ లింగం, శరత్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగురోజులు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలు బంద్



భిక్కనూరు: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలు నాలుగు రోజుల పాటు నిలిచి ఉంటాయని భిక్కనూరు శాఖ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన గురువారం భిక్కనూరులో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ శాఖలను తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో భారత ప్రభుత్వ ఆదేశానుసారం విలీనం చేస్తున్నందున ఈనెల 28 నుంచి 31 వరకు తెలంగాణ బ్యాంక్ సేవలన్నీ నిలిచి ఉంటాయన్నారు. జనవరి ఒకటో తేది నుంచి సేవలు తిరిగి ప్రారంభమవుతాయన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఫరీదుపేట క్రీడాకారులు



మాచారెడ్డి: కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ కబడ్డీ పోటీల్లో పాల్వంచ మండలం ఫరీదుపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని గొల్ల సాగరికతో పాటు గ్రామానికి చెందిన క్రీడాకారులు కావ్య, హర్షిక, భావనలు ఈ నెల 27 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌లో జరగనున్న కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రామ్ మనోహర్ రావు తెలిపారు. గురువారం క్రీడాకారులను అభినందించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి కోసం గురువారం కామారెడ్డికి చెందిన బొందుగుల పాటి పాండురంగారావు, సరస్వతి దంపతులు రూ 5 వేలు, లక్ష్మీ నరసింహారావు, ఇందిరా దంపతులు రూ.5 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి సన్మానించారు.

బోసిపోయిన భిక్కనూరు పోలీస్‌స్టేషన్



భిక్కనూరు: స్థానిక ఎస్సై సాయికుమార్ ఆత్మహత్య చేసుకోవడంతో భిక్కనూరు పోలీస్ స్టేషన్ గురువారం బోసిపోయింది. ప్రతి రోజు ఫిర్యాదుదారులతో నిండి ఉండే ఈ పోలీస్ స్టేషన్ గురువారం పూర్తిగా నిర్మానుష్యంగా మారింది. పోలీస్ అధికారులు సాయికుమార్ అంత్యక్రియలకు తరలివెళ్లారు. కేవలం ఒక హెడ్‌కానిస్టేబుల్ ముగ్గురు కానిస్టేబుళ్లు మాత్రమే పోలీస్‌స్టేషన్‌లో ఉన్నారు. నిన్నటి వరకు తమకు పై అధికారిగా ఉన్న ఎస్సై సాయి కుమార్ ఆత్మహత్య చేసుకోవడంతో వారంతం తీవ్ర ఆందోళనకు గురైనట్లు కనిపించారు.

ప్రభుత్వ సలహాదారును కలిసిన టీఎన్‌జీవోలు



కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీని గురువారం టీఎన్‌జీవోస్ జిల్లా నాయకులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. టీఎన్‌జీవోస్ జిల్లా ప్రతినిధులుగా కొత్తగా ఎన్నికైన వారిని షబ్బీర్‌అలీకి జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి పరిచయం చేశారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముల్క నాగరాజు, సహ అధ్యక్షుడు ఎం.చక్రధర్, కోశాధికారి ఎం.దేవ రాజు, ఉపాధ్యక్షులు బి.లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి అబ్దుల్ ఖాదిర్, ప్రతినిధులు రంజిత్, రాజిరెడ్డి, పవన్‌కుమార్, బి.సంతోష్, అల్లాడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

గోదాదేవి ఆలయంలో నారాయణ మహాయజ్ఞం



కామారెడ్డి అర్బన్: ధనుర్మాసం సందర్భంగా స్థానిక గోదాదేవి రంగనాథస్వామి ఆలయంలో శ్రీవాత్సాద శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏకాదశి తిథిలో నారాయణ మహా యజ్ఞం నిర్వహించారు. శ్రీరామకోటి జపలిఖిత ప్రచారకులు కృష్ణానంద స్వామి, శ్రీవైష్ణవ సంఘం గౌరవ అధ్యక్షుడు నల్లవెల్లి అశోక్, అధ్యక్షుడు గుమ్మల రవి, కార్యదర్శి నరేందర్, అశోక్‌నగర్, స్నేహపురి, శ్రీనివాస్‌నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భారీగా తరలివచ్చారు. అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సాయి ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లి గ్రామ షిరిడీ సాయి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేపట్టారు.

ఘనంగా సుదర్శన హోమం



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా గురువారం సుదర్శన నారసింహ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. హోమంలో కామారెడ్డి, నిజామాబాద్, హైదరాబాద్, సిరిసిల్ల జిల్లాలకు చెందిన 18 జంటలు పాల్గొన్నాయి. ఆలయ ఈవో శ్రీధర్ రావు, సిబ్బంది సంతోష్, అర్చకులు నరసింహాచార్యులు, శ్రీనివాసాచార్యులు, పరంధామాచార్యులు, సంజీవాచార్యులు ఉన్నారు.

ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని కాకుండా..


డి-11 పంటకాలువలో పూడిక తీస్తున్న పొక్లెయిన్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎవరో వస్తారని..ఏదో చేస్తారని ఆ రైతులు ఎదురు చూడలేదు. స్వయంగా వారే ముందుకొచ్చి సాగునీరు వారి భూములకు అందేలా పంట కాలువలో పూడికను తీయించారు. చీనూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు పోచారం ప్రధాన కాలువలో ప్రవహించే సాగునీరు డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా తమ భూములకు అందేలా కాలువలో పొక్లెయిన్ సహాయంతో పూడికను తీయించారు. కొన్నిరోజులు క్రితం లస్కర్లు పంటకాలువలో కొంతదూరం వరకు పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించారు. మిగిలిన పంటకాలువలో పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలతో పాటు పూడికను పలువురు రైతులు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకున్న పొక్లెయిన్ సహాయంతో తొలగింపజేశారు. పూడిక తీయించేందుకు రూ.25వేలపైగా ఖర్చయిందని ఆయకట్టు రైతులు తెలిపారు.

పారిశుధ్యం అధ్వానం

- రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురికినీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, స్థానికులు


డ్రైయినేజీలో నుంచి బయటకు వస్తున్న మురికి నీరు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం గోపాల్‌పేటలో చేపట్టిన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఇది వరకు ఉన్న డ్రైనేజీలు ధ్వంసం కావడంతో కొద్దిరోజులుగా మురికినీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. గ్రామంలోని పెట్రోల్‌బంకు సమీపంలో చికెన్ మార్కెట్‌కు వెళ్లే దారిలో నుంచి మురికినీరు ప్రవహించేందుకు ఇదివరకు ఉన్న డ్రైనేజీ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ధ్వంసమైంది. దీంతో చికెన్ దుకాణాల నుంచి వస్తున్న మురికి నీరు ప్రధాన రహదారి పక్కనే నూతనంగా ఏర్పాటు చేస్తున్న సర్వీస్ రోడ్డుపైకి చేరుతుంది. దీంతో ఆ ప్రాంతంలో తీవ్రదుర్గంధం వెదజల్లడంతోపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఫలితంగా వాహనదారులతోపాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డుపై మురికి నీరు స్తంభించకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



కామారెడ్డి టౌన్: సీపీఐ శత వార్షికోత్సవం గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు వీఎల్. నర్సింహారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందేళ్లగా ప్రజల కోసం పోరాటాలు చేస్తూ ఎన్నో విజయాలు సాధించిన పార్టీ సీపీఐ అని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్, సహాయ కార్యదర్శి బాలరాజు, కార్యవర్గ సభ్యులు దేవయ్య, రాజమణి, ఈశ్వర్, మల్లేష్, హన్మాండ్లు, సాయిలు, స్వామి పాల్గొన్నారు.